# వాస్తవం

**ఎందుకో** వెనక్కి తిరిగేడతను. ప్లాట్‌ఫాం దరిదాపు చివర. పసుపు పచ్చటి బోర్డు మీద నల్లటి వాక్యాలు చదివేడు."భీమవరం, నరసాపురం, పాలకొల్లుకు ఇచ్చట మారవలెను" ఎందుకు మారాలి? కానీ మారాలనిపించిందతనికి. వెళ్లి భీమవరం టికెట్టు తీసుకుని అవతలి ప్లాట్‌ఫామ్ మీదికి వెళ్లేడు. చాలా దూరం వెళ్లాలని ఉందతనికి. గమ్యం ముఖ్యం కాదు. వెళ్లడం ముఖ్యం. మనుషుల్నీ పరిసరాల్నీ ఒదిలించుకున్నా మనసులో పుట్టగొడుగుల్లా దుఃఖం పెరుగుతూ తనతోటే ఉంటోంది. శీతాకాలపు సాయంత్రాన్ని చీలుస్తూ పచ్చటి రైలు పాకుతూ అతని ముందు ఆగింది. చిట్ట చివరి ఖాళీపెట్టె చూసుకుని కిటికీ పక్కనే కూచున్నాడతను. పచ్చగీతలా సాగుతోంది రైలు.

ఆకాశం వరకూ పచ్చటి చల్లటి పొలాలు. కమ్మటిగాలి అతని ముఖాన్ని తెరలు తెరలుగా కప్పుతోంది. కిటికీలోంచి వెనక్కి చూశాడు. చిన్నవంపు పొలాల్లోంచి పట్టాల మీదికి పాకిన పచ్చపురుగులా ఉంది రైలు. క్రమంగా చల్లదనం అతని కళ్లలోంచి మనసులోకి జారుతోంది. కదుల్తోన్న వర్ణ చిత్రానికి ఫ్రేములా ఉంది కిటికీ. ఆ చట్రంలోకి చటుక్కున తెల్లటి కొంగలు వచ్చి కూచున్నాయి. నీలాకాశానికి తెల్లకుట్లు విడిచిపోయినట్టుగా వరసలు వాలి కూచుంటున్నాయి. రైలు ఆగుతోంది వంపు తిరుగుతూ పొలం ఒంపు తిరుగుతోంది. నిశ్చలన చిత్రం చల్లటిగాలిలో మళ్లీ చిత్రం కదుల్తోంది. వెనక్కి చూశాడతను. అతని చూపు పడగానే కొంగలు ఆకాశంలోకి తేలేయి. మళ్లీ వెనక్కివాటి కూచున్నాడతను. కిటికీలొంచి పచ్చటి ప్రవాహం వెనక్కి పోతోంది. పచ్చదనం మెరుస్తోంది. రైలు కూసినట్టు నిట్టూర్చేడతను. హఠాత్తుగా బరువేదో మనసులోంచి చల్లటిగాలిలో కలిసిపోయినట్టయింది. మెత్తటి అలల్లాగ లేచి పడుతున్న టెలిగ్రాఫ్ తీగల తరంగాల మీద పిట్టలువాలి వెళ్తున్నాయి. ఈలోకం తనదికాదు. అయినా అతనికి టెలిగ్రాఫ్ తీగల ఆవలి ప్రపంచంలో కొంగలలాంటి సంబంధం ఏర్పడింది. అతని కనుకొలకుల్లోంచి నీరెండ వెనక్కి వెళ్లిపోయింది. రైలెందుకో తడబడుతూ వేగం తగ్గుతోంది.

గడ్డి మేటు గోడ నానుకుని ఉంది. పక్కనే గన్నేరు చెట్టు. పాతసిమెంటు గోడ అక్కడక్కడ పగుల్లిచ్చింది. గడ్డిలాగి గేదెల ముందు పడేశాడతను. ఒకక్షణం నుంచుని గోడ అవతలి సన్నటి వీధివేపు చూశాడు. తలమీంచి తెల్ల కండువా కప్పుకుని మోకాలి

వరకూ పంచకట్టుకుని వాడు నక్కి నక్కి వీధి చివర అడ్డదార్లొంచి పొలాల్లోకి వెళ్లడానికి మెత్తగా జారుకుంటున్నాడు. అతను వాణ్ని గుర్తు పట్టేడు. రక్తం ఉడుకు లెత్తింది. వాడింక ప్రాణాలతో బతకడు. అందుకే ఇన్నాళ్లకి తన కంటబడ్డాడు. చటుక్కన వెనక్కి తిరిగి గొడ్లశాల చూర్లోంచి పెద్ద కొడవలి లాగేడు. తువాలు గట్టిగా తలపాగాచుట్టి ఒక్క అంగలో గోడచివరి తలుపుతీసి బయటికి గెంతేడు వెంటబడ్డాడతను. ముందు నడుస్తున్నవాడు అనుకోకుండా వెనక్కి తిరిగి కొడవలితో మృత్యువులా వెంటబడుతోన్న వ్యక్తిని చూశాడు. వాడు అడ్డదారిలో పరిగెట్టడం ప్రారంభించాడు. అతను వెంబడించాడు. క్షణాల్లో ఇద్దరూ అడ్డదారి మలుపు తిరిగి పొలాల్లో పడ్డారు. వేట నిశ్శబ్దంగా జరుగుతోంది. అతనికి చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది. పులి కంటికి లేడిలా వాడు పొలం గట్ల వెంట పరిగెడుతూ జారిపడి వెంటనే లేచి అడ్డంగా పరుగెత్తేడు. అతని చెమటవాసన అతనికే తగుల్తోంది. ఊపిరితిత్తులు బద్దలవుతున్నాయివాడికీ. సన్నగా ఉండడం వల్ల వేగంగా పరిగెడుతున్నాడు. మెడమీంచి కండువా వెనక్కి ప్రవాహంలా ఎగురుతోంది. వెనక్కి తిరిగి చూసేడు. అతను ఎక్కువ దూరంలో లేడు. చేలవతల ఏదో రైలు కట్ట మీద మెల్లగా కదుల్తోంది. వెనక అడుగుల శబ్దం దగ్గిరవుతోంది. కళ్లలోంచి చెమట తుడుచుకున్నాడు వాడు.

చీకటి ముందు, మసక ముందు తెలినలుపు. మరో వంపేదో తిరుగుతూ రైలు ఆగుతోంది. కిటికీలోంచి బయటికి చూశాడతను. అతని గాయాన్ని కొంగ లెత్తుకు పోయాయి. కళ్లు పెద్దవి చూసి చూశాడు. దూరంగా నల్లబడ్డానికి సిద్ధం అవుతున్న చోటు. హఠాత్తుగా, మెడమీంచి తెల్లకొంగుపిల్ల కాలువలా ఎగురుతూ ఒక స్త్రీ పొలం మధ్యకి వచ్చింది. కొంగు చివర ఒక వ్యక్తి ఆమెను వెంబడిస్తున్నాడు. కళ్ల జోడు పెట్టుకుని జాగ్రత్తగా చూశాడతను. గాలిసవ్వడి నింపుతోన్న ఆ చల్లటి నిశ్శబ్దంలో ఆమె అతనికి దొరికిపోయింది. ఇద్దరూ కిందపడ్డారు. గట్టు మీద మొక్కల మధ్యనుంచి రెండు అస్పష్టమైన ఆకారాలు కనిపిస్తున్నాయి. అతని గుండె దడదడ లాడింది. ఇంత అద్భుతాన్ని అతనెప్పుడూ చూడలేదు. ఈ నీలాకాశం జల్లెడపోస్తున్న లేత నీలిమలో ఒణికి పోతున్న చేల పచ్చి పరిమళంలో రెండు పెద్ద కొంగల్లాగ, కుందేళ్లలాగ పొలం గట్టుకింద జరుగుతున్న శృంగార క్రీడ, ఇంతకు ముందెప్పుడు తెలీని ఊహించని వెచ్చటి ఆనందాన్ని కలిగించిందతనికి. కాలం ఆగిపోయినట్టనిపించింది. దూరంగా పొలం గట్టు దగ్గిరి చివరికతను ఆమెను వశపరుచుకున్నాడు. కిటికీలోంచి నడుంకింది భాగం మాత్రం చూడగలుగుతున్నాడు. కళ్ళజోడు తుడుచుకుని చూశాడు. పొలంలో అతను ఆమె కొంగు తీసి వెనక్కి పారేశాడు. కాళ్ల జతలు తీవ్రంగా కదులుతున్నాయి. కళ్లు పెద్దవి చూసి చూశాడతను. హఠాత్తుగా

రైలు బయలుదేరుతుందేమోనని భయంవేసిందతనికి. ఇప్పుడు మళ్లీ చూశాడు. కదలికలు ఆగిపోయినట్టున్నాయి. ఈ అయాచిత శృంగారక్రీడ తనొక్కడే చూశాడా? రైలు ఇటువేపు ఉన్నవాళ్లందరూ చూసే ఉండాలి. కానీ అంత పరిశీలనగా గమనించి ఉంటారా? లేదని సమాధానంగా చెప్పుకున్నాడతను.

ముందు వాడు పారిపోతున్నాడు ఒక్క అరుపు అరిచి పడిపోయాడు. పంచ ఇంక పరిగెత్తనివ్వడం లేదు. అతను వాణ్ని సమీపించి కిందపడ్డ వ్యక్తిని ఒకసారి చూసి లేవకుండా వాడి మీద పడ్డాడు. సన్నగా పీలగా గడగడ వణుకుతూ అతని బలమైన శరీరం కింద ప్రాణభయంలో రొప్పుతున్నాడు. అతను ఒక చేత్తో వాడి తెల్లకండువా లాగి వెనక్కి పారేశాడు. అతని ముఖం మీంచి చెమట కారి వాడి ముఖం మీద పడుతోంది. చావులాంటి చెమట వాసన చెమట వాసన లాంటి చావు వాణ్ని కమ్మేయి. అతను ఒక తడిచేత్తో వాడి పీక పట్టుకున్నాడు. వాడు చివరి ప్రయత్నంగా అతన్ని మీద నుంచి నెట్టడానికి ఉన్న శక్తినంతా కాళ్లలోకి తెచ్చుకుని పెనుగు లాడేడు. వాడి కాళ్లని అతని బలమైన కాళ్లు అదిమిపెట్టాయి. పీక నొక్కుకుంటే వాడి కళ్లు పెద్దవై గుడ్లు తేలిపోతున్నాయి. కొడవలి పక్కనే పడేసి రెండు చేతులతో వాడి పీక గట్టిగా అదిమిపెట్టేడతను. వాడి నోరు వికృతంగా శబ్దం చేస్తూ తెరుచుకుంది. కొన్ని సెకన్లలో వాడు గుడ్లు తేలేశాడు. అతని ఆయాసం తగ్గింది. చేలవతల రైలు కూత వినిపించిందతనికి. ఉలిక్కిపడి లేచి గట్టు ఇవతలి కొచ్చి పంచ సద్దుకుని ముఖం తుడుచుకుని అటూ ఇటూ చూసి మళ్లీ పొలంలోకి వెళ్లేడతను.

రైలుకూతకి ఉలికిపడ్డాడతను. చిన్న కుదుపుతో బయల్దేరింది రైలు. నల్లబడుతోన్న సంధ్యలోంచి దూరంగా అతను లేచి నుంచుని ఇవతలికి వచ్చి పంచ సద్దుకుని అటూ ఇటూ చూసి మళ్లీ పొలంలోకి వెళ్లేడతను. కిటికీ చట్రం చివరికి వస్తున్నాడతను. తల బయటపెట్టి చూశాడతను. కిటికీలోంచి దూరం అయిపోయాడతను. వెనక్కివాలి నవ్వుకున్నాడతను. రైలు మారడం మంచిదే అయింది.

❖ ❖ ❖